# పారిపోయిన ఖైదీ

★

అంధపరపు మల్లిబాబు

జైలంతా గోడవగా వుంది.

అందరూ హడావుడిగా అటూ యిటూ పరిగెడుతున్నారు. అందరి మొహాల్లోనూ ఆందోళన, భయం ద్యోతకమౌతున్నాయ్. ఏం జరిగిందో ఎవరికీ తెలియదు——కానిస్టేబుల్స్‌కి, జైల్ సూపరింటెండెంట్‌కి తప్ప. అడిగినా ఎవరూ చెప్పడంలేదు.

కనిపించిన ప్రతి కానిస్టేబుల్ మీద విరుచుకు పడుతున్నాడు సూపరింటెండెంట్.

"పారిపోయిన ఖైదీని మళ్ళీ పట్టుకోవడం ఎంత కష్టమో మీకు తెలుసా?" సూపర్నెంటు కళ్ళు ఎర్రగా, చింతనిప్పుల్లా మండుతున్నాయి.

ఖైదీ పారిపోవడానికి అవకాశమిచ్చిన కానిస్టేబుల్ బిక్కమొగం వేసేడు.

"మాట్లాడవేం? ఎలా తప్పించుకున్నాడు?" గుడ్లురిమి చూసేడు.

"కడుపునొప్పి అన్నాడు సార్. సెల్ తలుపు తెరిచేను. మెరుపులా దెబ్బతీసి మాయమయ్యేడు. అంతవరకూ కడుపునొప్పితో లుంగచుట్టుకుపోతున్న మనిషిను నాకు తెలివి వచ్చేసరికి నోట్లో గుడ్డలు కుక్కివున్నాయి. కాళ్ళూ, చేతులకు కట్లు" చెప్పేడు.

"వాణ్ణి పట్టుకోవడానికి డిపార్టుమెంట్ చాలా కష్టాలు పడింది. మీ అజాగ్రత్తవల్ల తప్పించుకుపోయేడు. బోనెక్కించినా, చిత్రహింసలు పెట్టినావాడు దోపిడి చేసిన సంపద యెక్కడ దాచేదో బయటపెట్టలేదు. పదిహేనేళ్ళు శిక్షపడింది. ఇంకో రెండేళ్ళలో విడుదల కావలసినవాడు యిప్పుడే పారిపోయి డిపార్టుమెంట్ ఎత్తులనే చిత్తుచేశాడంటే డిపార్టుమెంట్‌కి ఎంత తలవంపు?"

కానిస్టేబుల్ మాట్లాడకుండా నిలబడ్డాడు.

కానిస్టేబుల్స్ అందరికీ ఏవేవో పనులు పురమాయించి, ఎక్కడెక్కడికో ఫోన్ చెయ్యసాగేడు సూపర్నెంటు.

కమీషనరుకి, చుట్టుప్రక్కల పోలీస్ స్టేషన్లకి ఫోన్‌కాల్స్ వెళ్ళేయి. కమీషనర్ పెట్టిన చీవాట్లన్నీ చచ్చినట్లు భరించేడు. క్రైమ్ బ్రాంచికి ఫోన్‌చేసి గంగారామ్‌ని తిరిగి పట్టుకోవడానికి సన్నాహాలు చేయమని కమీషనర్ ఉత్తర్వు.

డిపార్టుమెంట్ ప్రణాళికనే తారుమారు చేస్తూ, పారిపోయిన 'ఖైదీ గంగారామ్' తెలివితేటలను ప్రశంసించక తప్పదు.

గంగారామ్ మళ్ళీ పట్టుబడతాడా?

గంగారామ్‌లాంటి పురానా దొంగను తిరిగి పట్టుకోవడం అంత తేలిక కాదు.

ఆలోచనలను కట్టిపెట్టి క్రైమ్ బ్రాంచికి ఫోన్ చేసేడు వెంటనే.

## 2

గాఢనిద్రలో మునిగిన రాజారావు భయంకరమైన అరుపులకు వులిక్కిపడుతూ లేచాడు.

"బాబోయ్! నన్ను....చంపేస్తున్నారు.... దొంగలు....దొంగలు...." అంటూ ప్రక్కనున్న మంచం మీద గిలగిల తన్నుకుంటున్నాడు పన్నెండేళ్ళ చిన్నబాబు.

చిన్నబాబు అసలు పేరు చిన్నారావ్. ఇంట్లో అందరూ 'చిన్నా' అని కూడా ముద్దుగా పిలుస్తారు రాజారావు దంపతులకు లేకలేక కలిగిన సంతానం చిన్నబాబు.

మంచం మీద కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ, ఆర్తనాదాలు చేస్తున్న చిన్నబాబు దగ్గరకు ఆత్రుతగా లేచివచ్చేడు రాజారావు.

ప్రక్కగదిలో చుట్టాలతోపాటు నిద్రపోతున్న రాజారావు భార్య లలిత కూడా కొడుకు అరుపులకు హడలిపోతూ వచ్చింది. చుట్టాలు కూడా కళ్ళు నులుముకుంటూ రాజారావు గదిలోనికొచ్చేరు

నిద్రలో యింకా ఆర్తనాదాలు చేస్తూనే వున్నాడు చిన్నబాబు

"బాబూ! .. ...." అంటూ తట్టిలేపాడు రాజారావు.

లాభం లేకపోయింది. చిన్నబాబు కళ్ళు తెరవలేదు.

మరోసారి ప్రయత్నించేడు రాజారావు. ప్రయోజనం లేకపోయింది. ఇక యిలాగ లాభంలేదని మంచంప్రక్కనస్టూలుమీద తాగడానికని వుంచిన గాజు కూజాలోని నీటిని చిన్నబాబు ముఖం మీద క్రుమ్మరించేడు. దాంతో కళ్ళు తెరిచేడు. తనచుట్టూవున్న తల్లిదండ్రులనీ, చుట్టాలను చూసి కళ్ళు పెద్దవి చేసేడు.

"మీరు ...మీరు..." భయంతో కాబోలు చిన్నబాబు నోటినుండి మాట రాలేదు.

శరీరం చిన్నగా యింకా వణుకుతోంది.

"చిన్నా! పీడకల వచ్చి ఉలుసుకున్నావా?" కొడుకు తలమీద ప్రేమగా చేత్తో రాస్తూ ప్రశ్నించింది లలిత.

తల్లివేపు వెర్రిచూపులు చూశాడు చిన్నబాబు. ఆ చూపులు మతిభ్రమించిన మనిషి చూపులు మాదిరిగావున్నాయి. చిన్నబాబు పరిస్థితికి అందరూ కలవరపడుతున్నారు.

రాజారావు కొడుకు మంచం మీద కూర్చుని, చిన్నబాబును దగ్గరకు తీసుకున్నాడు

"ఏం జరిగింది చిన్నా! ఎందుకలా వణికిపోతున్నావ్? మన యింట్లో దొంగలు పడినట్లుగా కలవచ్చిందా? చెప్పవూ?" అంటూ లాలనగా ప్రశ్నించేడు రాజారావు.

చిన్నబాబు బదులు పలకలేదు.

మళ్ళీ అవే వెర్రి చూపులు!

రాజారావు, లలిత కొడుకును ఎంత అనునయించి, ధైర్యం చెప్పినా లాభం లేకపోయింది.

ఆడుతూ, పాడుతూ ఎప్పుడూ ఎంతో హుషారుగా వుండే కొడుకు ఒక్కసారిగా ఇలాగ ఉలుకూ పలుకూ లేకుండా వెర్రి చూపులు ఎందుకు చూస్తున్నాడో అని భయపడ్డారు.

రాజారావు దంపతులకు తమ కొడుకు ధోరణి తీవ్రమైన ఆందోళనకు గురిచేసింది.

"పిచ్చి పట్టిందేమో...." చుట్టాల్లో ఒకామె మెల్లగా గొణిగింది.

"పిచ్చికాదులేవే. కుర్రాడు నిక్షేపంలా కనిపిస్తుంటేనూ. ఏ దెయ్యమో. గాలో సోకింది....అంతే" మరొకామె అంటోంది.

"అవునండి. వాళ్ళు చెప్పింది నిజమే అయివుంటుంది. సాయంకాలం వరకు శుభ్రంగా వున్నవాడు ఇప్పటికిప్పుడు ఇలాగైపోయేడంటే ఇదేదో దయ్యంపనే అయివుంటుంది. వెంటనే వెళ్ళి, మంచి భూతవైద్యుడ్ని తీసుకురండి" అంది లలిత.

ఆలోచిస్తే రాజారావుకి అదే బాగుందనిపించింది. బాబును జాగ్రత్తగా చూస్తుండమని చెప్పి, గారేజ్‌నుంచి కారుతీసి, భూతవైద్యుడి కోసం బయల్దేరాడు.

రాజారావు ఏషియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో కెమిస్టుగా పని చేస్తున్నాడు.

చిన్నప్పుడు వీధిదీపాల క్రింద చదువుకుని, జీవితంలో పైకి వచ్చిన మనిషతడు.

ఇప్పుడతనికి కంపెనీలో పదిహేను వందల రూపాయం జీతం ఇస్తున్నారు.

కారు కూడా యిచ్చారు. వుంటున్న ఇల్లు కూడా కంపెనీదే. సరిగ్గా వారం రోజుల క్రితమే ప్రమోషన్ మీద ఆ వూరికి బదిలీ అయివచ్చేడు రాజారావు.

నాలుగు వీధులు గాలించి, భూతవైద్యుడి పట్టుకుని తీసుకు వచ్చేడు

రాజారావు చేతిని ఓ యాభై రూపాయలు వదిలించేసుకుని చక్కాపోయేడు భూతవైద్యుడు. చిన్నబాబు ప్రవర్తనలో మార్పు లేదు. ఓ ప్రక్క కూర్చొని, దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నాడు.

## 3

అప్పటికి అర్థరాత్రి దాటింది.

చిన్నబాబులో ఆ వెర్రిచూపులకు కారణం అర్థంగాక ఏడుస్తోంది లలిత.

"ఛ,ఛ! ఏడుస్తున్నావా? ఇప్పుడేమయిందని?" భార్యను మందలించేడు రాజారావు,

"బాబుకేమైందండి?" దుఃఖం ముంచుకొస్తుంది లలితకు.

"నాకూ అంతుపట్టడంలేదు. మన డాక్టరికి ఫోన్ చేస్తానుండు"

రాజారావు ఫామిలీ డాక్టరుకి ఫోనుచేసి అర్జంటుగా రమ్మనమని చెప్పేడు.

పావుగంట దాటకముందే డాక్టర్ మెడికల్ కిట్ పట్టుకుని ఆదరాబాదరాగా వచ్చేడు.

చిన్నబాబు అరుపులతో తనకు మెలకువ వచ్చేసిన దగ్గర్నుంచి, అంతవరకూ జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చేడు రాజారావు.

చిన్నబాబును స్టెత్‌స్కోప్‌తో పూర్తిగా పరీక్ష చేసేడు. పల్స్ చూసేడు

పావుగంటకు పైగా పరీక్ష చేసినా చిన్నబాబు వ్యాధేమిటో డాక్టర్‌కి తెలియలేదు.

"చూడండి రాజారావ్! అబ్బాయి శారీరకంగా చాలా ఆరోగ్యంగా వున్నాడు." అని చిన్నబాబువేపు తిరిగి "బాబూ! నిద్రలో ఏమన్నా భయంకరమైన కలలు వచ్చేయా?" అవే అడిగేడు డాక్టరు.

జవాబు శూన్యం!

అవే వెర్రి చూపులు!!

రకరకాలుగా ప్రశ్నించినా, సమాధానం చెప్పించలేకపోయేరు.

డాక్టర్ పెదిమి విరిచేడు.

"అయితే ఈ పరిస్థితికి కారణం చెప్పలేదు డాక్టర్?" డాక్టర్‌వేపు నిరాశగా చూస్తూ అంది లలిత.

"ఇది మెంటల్‌కి సంబంధించిన విషయం. నాకు తెలిసిన సైకాలజిస్టు ఒకాయన వున్నారు. ఎడ్రసు యిస్తాను వెళ్ళండి. ఫలితం వుంటుంది."

"అలాగే డాక్టర్! కానీ! బాబుకి ఈరాత్రి ప్రమాదం ఏమీ లేదా?" అనడిగేడు.

"డోంట్ వర్రీ! నిద్రపట్టడానికి యింజక్షన్ యిస్తాను ఈ నిద్రలో కలవరింతలు రావచ్చు. వాటిని జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని యథాతథంగా సైకియాట్రిస్టుకి చెప్పండి." అని యింజక్షన్ చేసి, సైకియాట్రిస్టు ఎడ్రసు రాసిచ్చి వెళ్ళిపోయేడు డాక్టరు.

తెల్లవారేవరకు చిన్నబాబును కనిపెట్టుకుని మంచం ప్రక్కనే కూర్చుంది లలిత.

## 4

"మే ఐ కమిన్ ప్లీజ్?"

"ఎస్! కమిన్!"

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని రాజారావు, లలిత, చిన్నారావు లోనికి వెళ్ళేరు.

టేబుల్‌మీద ఎక్సరే రిపోర్టును వ్రాసుకుంటున్న డాక్టర్ చక్రవర్తి చిన్నగా తల పైకెత్తి చూసేడు.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్!" విష్‌చేసేడు రాజారావు.

"హల్లో, గుడ్‌మార్నింగ్, ప్లీజ్ సిడౌన్" ఎదురుగా వున్న కుర్చీలు చూపించేడు డాక్టర్ చక్రవర్తి.

రాజారావు, లలిత కుర్చీలలో కూర్చున్నారు. లలిత ప్రక్కన నిలుచుని రూమ్ అంతా చూస్తున్నాడు చిన్నబాబు.

డాక్టర్ చక్రవర్తి ఇక చెప్పమన్నట్టుగా రాజారావు వేపు చూసేడు.

"డాక్టర్! మీరు గొప్ప సైకాలజిస్టు అని, అనేక మానసిక వ్యాధులకు అతి నైపుణ్యంతో చికిత్స చేసారని విన్నాం. ఇప్పుడు మిమ్మల్ని నమ్ముకుని యిక్కడకు వచ్చాం."

"థాంక్స్."

"మా ఫామిలీ డాక్టర్ కూడా మీ ఎడ్రసు యిచ్చారు. మీరు మా బాబును కాపాడాలి" అన్నాడు రాజారావు.

"ఆల్ రైట్! అసలు విషయం విపులంగా చెప్పండి."

గతరాత్రి చిన్నబాబు నిద్రలోలేచి భయంతో అరవడం వణికిపోవడం, వెర్రి చూపులు చూడ్డం అంతా పూసగుచ్చినట్లుగా వివరించి చెప్పాడు రాజారావు.

సైకాలజిస్టు అంతా విని, చిన్నబాబుకు కొన్ని పరీక్షలు జరిపాడు. అతనికి కొంత అర్థమయింది. ప్రైవేట్ ఛాంబర్ లోనికి తీసుకెళ్ళి చిన్నబాబుకు ఎలక్ట్రికల్ షాక్ ట్రీట్ మెంట్ యిచ్చాడు.

ఆ తర్వాత, చిన్నబాబు అక్కడే నిద్రలోకి జారుకున్నాడు. మూడు నాలుగు గంటల తర్వాత చిన్నబాబుకి తెలివి వచ్చింది.

ఇప్పుడు వెర్రిచూపులు చూడటంలేదు. మామూలుగానే వున్నాడు.

ఒక కప్పునిండా వేడి హార్లిక్స్ చిన్నబాబుకు యిచ్చాడు సైకాలజిస్టు చక్రవర్తి.

రాజారావును, లలితను కొడుక్కి చెరోవేపు కూర్చోమని సైగ జేసాడు.

"బాబూ! రాత్రంతా కేకలేసావేమిటి? పీడకలలు వచ్చి భయపడ్డావా?" అని అనునయంగా ప్రశ్నించాడు సైకాలజిస్టు.

జవాబు చెప్పమన్నట్టుగా కొడుకు తలను ఆప్యాయంగా నిమిరింది లలిత.

"ఊహూ(.... కలకాదు. దొంగలు.... డబ్బు హత్య...." అస్పష్టంగా గొణిగాడు చిన్నబాబు.

"డబ్బా? ఎంత డబ్బు?

"బోలెడు నోట్ల కట్టలు, ఇద్దరు మనుషులు మోసుకొచ్చారు —"

"ఎవరా యిద్దరు?"

"దొంగలు!"

సైకాలజిస్టు కళ్ళు చిత్రంగా మెరిశాయి.

"మరి హత్య ఏమిటి? నువ్వు చూసావా?"

ఆ దొంగల్లో ఒకడు మరొక దొంగను చంపేశాడు. అది నేను కళ్ళారా చూశాను?"

"నిజంగానా?"

"అవును."

"ఎందుకు చంపాడు?".

"ఆ డబ్బంతా తానే అనుభవించాలనే ఆశతో."

చిన్నబాబు సమాధానాలకు సైకాలజిస్టు భృకుటి ముడివడింది. కుర్చీని దగ్గరగా లాక్కొని కూర్చున్నాడు.

"తర్వాతేం జరిగింది? వాళ్ళు నిన్ను చూడలేదా? జరిగిందేమిటో సరిగ్గా చెప్పు బాబూ!" అన్నాడు.

చిన్నబాబు మెల్లగా కళ్ళు మూసుకున్నాడు.

గతజన్మ స్మృతులు అతని మస్తిష్కంలో మెల్లగా కదలాడ సాగాయి.

"అవి నేను నిరుద్యోగంతో బాధపడుతున్న రోజులు. ప్రతిరోజూ బీచ్ కు వెళ్ళేవాడిని. ఏకాంతమంటే నాకు చాలా యిష్టం. ఓరోజు సాయంకాలం బాగా చీకటిపడేవరకూ బీచీకి దూరంగావున్న పాడుబడిన బంగళా వద్ద కూర్చున్నాను.

అమావాస్య రాత్రులు గావడంవల్ల మరీ చీకటిగా వుంది.

ఉలిక్కి పడ్డాను.

పాడుపడిన బంగళాలోనుంచి ఏవో మాటలు వినిపించాయి. ఆ బంగళాలో దెయ్యాలున్నాయని ఒకరిద్దరు అనడం విన్నాను. కొంపదీసి దెయ్యాలు కాదుకదా? కాని, దెయ్యాలమీద నమ్మకంలేదు. హూతూ హలంకొట్టి, ధైర్యంచేసి వెళ్ళి, తొంగి చూశాను.

అదిరి పడ్డాను.

ఇద్దరు దృఢకాయులు ఒక యినపెట్టెలో బంగారాన్ని, నోట్ల కట్టల్ని వుంచి, అక్కడ వున్న గోతిలో పాతిపెడుతున్నారు.

బంగారాన్ని, నోట్లకట్టలకీ చూస్తుంటే నా కళ్ళు చెదిరినయ్.

రెండ్రోజులక్రితం ఆ వూర్లో బ్యాంకు దోపిడీ జరిగిన విషయం గుర్తుకొచ్చింది. ఆ రోజు పేపర్లో దొంగలు ఫోటోలు కూడా ప్రచురించారు. ఆ దొంగల రూపం నాకు గుర్తుంది.

వీళ్ళే వాళ్ళు!

నా గుండె దడ హెచ్చింది.

ఇంకా, అక్కడ వాళ్ళేం చేస్తారో చూడాలన్న ఆలోచన కలిగింది. ఒక మూలనక్కి ఆతృతగా చూడసాగాను.


